# రోజులు మారాయి

-యలమర్తి అనూరాధ

కాలింగ్‌బెల్ అదే పనిగా మ్రోగుతోంది. హడావిడిగా బ్యాగ్ సర్దుకుంటున్న సాధన ఈ టైంలో ఎవరు వచ్చారబ్బా అని రవ్వంత నొసలు చిట్లించి ఎవరైనా ఆహ్వానించక తప్పదుగా అనుకుని పెదాల మీద నవ్వు పులుముకుని తలుపు తీసింది.

ఎదురుగా ఆడబడుచు జానకి.

గుండె గుభిల్లుమంది. అర్ధమొగుడు కదా. గుండె చిక్కబట్టుకుని "ఏమిటో వదినగారికి ఇన్నాళ్లకు మా ఇల్లు గుర్తుకొచ్చింది" అంది.

"అన్నయ్య లేడా వదినా!" అడిగింది చెప్పుల స్టాండు వైపు దృష్టి సారిస్తూ.

"లేరమ్మా! ఆఫీసు పని మీద క్యాంపుకి రాత్రికి రాత్రి బయలుదేరారు ఆఘమేఘాల మీద" అంది చివరిమాట వత్తి పలుకుతూ.

"అయ్యో!" అని నిట్టూర్చే లోపే "ఊళ్ళోనే కదా అని పుట్టింటికి ఏనాడూ ఉండడానికి పంపరు ఇలా వెళ్లడం, అలా ఎవరో ఒకరు రావడం. వచ్చెయ్యి అంటూ. ఉన్నట్టే అనిపించదు. అసలు ఊర్లో పుట్టిల్లు ఉండకూడదు వదినా"

"అలాగా" అంది అమాయకంగా.

ఆరునెలల నుంచీ అన్నయ్యను చూద్దామని ఇలా వచ్చింది. వదిన నోటికి దడిచి అన్నయ్య రానేరాడు.

తనకీ వద్దామంటే కుదరడం లేదు. గంట ప్రయాణంలో ప్రక్క ప్రక్కనే ఉండి చూడాలన్నా వెళ్లలేకపోవడం, కుదరకపోవడం మనసుకు బాధగా అనిపించేది.

ఈరోజు ఆదివారం అయినా స్పెషల్ క్లాసులు అని పిల్లలిద్దరూ చెబితే తెల్లవారుజామునే నిద్ర లేచి వాళ్లిద్దరికీ క్యారేజీలు సర్ది ఇచ్చి భర్తని ఈ ఒక్కరోజుకు పెట్టుకుని తినమని చెప్పి ఇలా పరుగెత్తుకొచ్చింది.

ఇదేమీ పట్టనట్లు, పట్టించుకోనట్లు ఆలోచనలలో ఉన్న వదినను చూసి మళ్లీ ప్రారంభించింది సాధన.

"నాలుగురోజులు అమ్మ దగ్గర సంతృప్తిగా గడిపి వద్దామని ఇప్పుడే. సంచి సర్దుతున్నాను. నువ్విలా వచ్చావు"

అప్పుడు తన మనసులో విషయం చెప్పింది జానకి.

రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుంది అని అడిగినట్లు "ఆహా! అన్నయ్యను చూద్దామని ఆయన లేని సమయంలో పనిగట్టుకుని వచ్చావా? వస్తున్నానని ఫోనైనా చేసి ఉండాల్సింది. ఈయన ఉండరని చెప్పేదాన్ని"

"నిజమే వదినా! ఎన్నాళ్ళనుంచో కుదరనిది, ఈరోజు కుదిరిందని అన్నయ్యని చూస్తున్నానన్న ఆనందంతో మనసు మనసులో ఉంటేనా? ఆ సంతోషంలో ఈ విషయం కనుక్కోవాలన్న ధ్యాసే లేదు"

"అవునా" అని టిఫిన్ కూడా అయిపోయింది. ఇప్పుడు ఈవిడగారి కోసం ఉప్మా తిప్పాలేమో. నా కర్మ ఇంతే. ఎప్పుడు సుఖపడదామనుకున్నా ఏదో అడ్డంకి. లోలోపల తిట్టుకుంటూనే.

"ఉండు వదినా. నాలుగు ఇడ్లీలు, దోశె తెస్తాను. నా అదృష్టం కొద్దీ ప్రక్కనే హోటల్" అంది వద్దని ఎలాగూ అంటుందిలే అనుకుంటూ.

"వద్దు వదినా ఇప్పుడలాంటి హడావిడి ఏం చెయ్యకు. నువ్వు అమ్మ వాళ్ళింటికి వెళదామనుకున్నావుగా వెళ్ళు. అమ్మ దగ్గరకు వెళదామనుకున్నాక వెళ్లలేకపోతే ఎలా ఉంటుందో నాకు తెలుసు. అన్నయ్య లేడుగా నేను వెళ్లిపోతాను. మళ్లీ వాడున్నప్పుడు ఫోన్ చేసి వస్తానులే!"

"టిఫిన్ వద్దంటున్నావు కాస్త కాఫీ అన్నా త్రాగి వెళ్ళు" అంది వంటింట్లోకి వెళుతూ.

ఆమె అలా వెళతాననడం మహా సంబరంగా ఉంది ఆమెకు. కానీ అదే పుట్టింటికి వెళ్లిన తనకు ఇలాంటి సత్కారం ఎదురైతే అని మాత్రం ఆలోచించడం లేదు.

అంత ఆలోచన ఉంటే ఇలా మాట్లాడదు. ఎదుటి వ్యక్తిని ఇలా రిసీవ్ చేసుకునేది కాదు.

"ఇప్పుడు కాఫీ అదేం వద్దు. కాసిని మంచి నీళ్ళు ఇవ్వు త్రాగి వెళ్లిపోతాను" అంది జానకి.

"ఏమిటో అన్నీ వద్దంటావు" అని గ్లాసుడు మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

అవి త్రాగి వచ్చిన దారినే వెళ్ళిపోయింది జానకి.

దారిలో 'రోజులు మారిపోయాయి. ఒకవేళ ప్రయాణమవుతున్నా ఆ విషయాన్ని మనసులో దాచుకుని ఆదరించేవారు ఇదివరకటి వారు. అతిథులు వెళ్లాకే తమ పని చూసుకునేవారు. ఇప్పుడలా కాదు ముఖం మీద కొట్టినట్లే సమాధానాలు' అనుకుంది.

అయినా తనదే తప్పు. ఒక్క ఫోన్ చేసి ఉంటే తనకే అన్నయ్యని ఇంతదూరం వచ్చి చూడలేకపోయానన్న నిరుత్సాహం లేకుండా పోయేది.

★ ★ ★

"అంతదూరం నుంచి వచ్చావు కదా! ఈరోజు ఉండి రేపు వెళ్లవచ్చు కదా అని ఒక్క మాట అనలేదే మీ వదిన" అంది అంతరాత్మ.

అలాంటి మంచిమాటలు వదిన నుంచీ ఎలా వస్తాయి?

గతం ఒక్కసారిగా ఆమె కళ్లముందు మెదిలింది.

★ ★ ★

పుష్కరాలకి రాక రాక ఆయన వస్తే ఎంత మాటంది?

"పిల్లాపీచుతో మొత్తమంతా దిగబడ్డారు. ఇంట్లో సరుకులు లేవు" ఇంకా మాట్లాడబోతుంటే అన్నయ్యే అడ్డుకున్నాడు.

"అది వింటే బాగుండదు. తల్లి వస్తుంటే పిల్లలు రాకుండా ఉంటారా? అదీ, పుష్కరాలు. ఇంట్లో ఏం లేవో చెప్పు. చిటికెలో తెస్తాను"

"ఎందుకు తేరూ! చెల్లెలు కదా. అప్పు అయినా చేసి తెస్తారు. అదే మా వాళ్లయితే డబ్బులెక్కడ్నుంచి తేనూ అంటారు"

"అబ్బా! నీ నస ఆపవే. వాళ్లుండేది ఒకటి, రెండురోజులు. కాస్త నీ నోటికి తాళం వెయ్యి" అంటూ అన్నయ్య బయటికి వెళ్లిపోయాడు.

ఇంత విన్నాక ఇంక ఉండబుద్ధి అవుతుందా? దర్శనం చేసుకుని భోజనం చేసి బయలుదేరి వెళ్లిపోయారు. ఈయన భోజనం కూడా వద్దన్నారు.

అన్నయ్య బాధపడతాడని తనే బ్రతిమిలాడి ఉంచింది ఆ పూట కూడా.

పుష్కరాలంటే ఇదివరకు రోజుల్లో ముందుగా పిలిపించుకునేవాళ్ళు.

ఇప్పుడు ఎవరో ఒకరు వస్తారని తెలిసినా వాళ్ల ముందు సామానులు తెప్పించుకుంటున్నారు. ఏంటో మనుషులిలా మారిపోయారు. ఇలా ఆలోచిస్తూనే ఉంది ఇంటికి వెళ్ళేదాకా.

★ ★ ★

రిక్షా దిగుతున్న సాధనను చూసి "అరె వదిన గారా!" అంది ఇంటికి తాళం వేసిన కీని పర్సులో పెట్టుకుని రుద్రాణి.

"అమ్మ లేదా?" అంది నిరుత్సాహంగా.

"లేరండీ! మీ రెండో అన్నయ్య దగ్గరికెళ్లారు. మీ అన్నయ్య దింపడానికి వెళ్లి నాలుగురోజులు ఉండి వస్తానన్నారు. అందుకే మా అమ్మ దగ్గరకు వెళ్దామని టిక్కెట్ రిజర్వ్ చేయించుకున్నాను" అంది వెళుతున్న ఆటోను ఆపుతూ.

జానకే గుర్తువచ్చింది సాధనకు. భగవంతుడున్నాడు మరి.

★

